ఊరు మంచి నిద్రలో ఉంది.

ఆకాశంలో తారలతో ఊసులాడుకుంటున్న చందమామకు మేఘాలు అడ్డు వచ్చాయి. వాతావరణంలో చల్లని గాలి తెర అలుముకుంది.

"టప్!

ఆకాశం నుంచి రాలిందో వాన చినుకు. అంతే! కూడబలుక్కున్నట్లు ఒక దాని వెంట ఒకటిగా జల్లులు పడసాగాయి. జల్లు రాను రానూ వానగా మారింది.

"టప్!"

సాంబయ్య చెయ్యి నిద్రలో దానంతట అదే చెంపను తడిమింది. మరికొన్ని చినుకులకు నిద్ర మత్తు ఎగిరిపోయింది. చప్పున లేచి కూర్చున్నాడు. ఎక్కడో దూరంగా ఉరుము ఉరిమిన శబ్దం! లేచి కిరననాయిలు లాంతరు ఒత్తిని పెద్దది చేశాడు. దీపం వెలుతుర్లో తల పైకెత్తి చూశాడు. వెదురు బొంగులు ఆధారంతో దిగుతున్న వర్షం నీరు కంటపడింది. తడికలో కూడా అక్కడక్కడ వాన పొటుకు ఉంది.

"వాన జోరుగా వస్తున్నట్లుంది. ఇక ఈ పొద్దుకి జాగరణేనన్నమాట!" తనలో తానే గొణుక్కున్నాడు సాంబయ్య.

పగలంతా కూలీ నాలీ చేసి దీపాలు పెట్టే వేళకు ఇల్లు చేరుకుంటారు పెళ్లాం మొగుడు. అంత వరకూ పిల్లలిద్దరూ గుడిసె దగ్గరనే ఆడుకుంటూనో, పడుకునో ఉంటారు. సాంబయ్య పెళ్లాం రంగమ్మ, వచ్చిన కూలీ డబ్బుల్తో శెట్టి అంగడికి పోయి ఆ దినానికి కావలసిన వంట సరుకులు కొనుక్కొచ్చి, వండి మొగుడికీ, పిల్లలకు పెట్టి తనూ తిని పడుకునేటప్పటికి ఎంతో పొద్దు పోతుంది. అలసిన శరీరాలు గోనె సంచులపై చేరగానే నిద్ర పట్టేస్తుంది.

"రంగీ...! ఏయ్ రంగీ... లెయ్యవే... వానొస్తుండాది" తట్టి లేపాడు భార్యను. వెంటనే లేచి కూర్చుంది రంగమ్మ. ఎక్కడో "దభేలో" మని పిడుగు పడిన శబ్దం.

ఆ శబ్దానికి "అర్జునా!... ఫల్గునా..." అన్న మాటలు ఆమె నోటిలో నుంచి వచ్చాయి. అప్పుడే అలా ఎందుకనాలో ఆమెకు తెలియదు. చిన్నప్పుడు ఆమె పక్కన పడుకునే అవ్వ పిడుగు పడినప్పుడల్లా అలా అనేది. అదే రంగమ్మకు కూడా వంటపట్టింది.

చెంబూ తప్పేలా తీసుకుని పొటుకు పడుతున్న చోటంతా వాటిని ఉంచింది. పిల్లలిద్దరినీ కారకుండా ఉన్నచోట పడుకోబెట్టాడు సాంబయ్య. రంగమ్మ పాత గోనె సంచి నొకదాన్ని తీసుకుని తడిసిన చోట తుడుస్తూ

"మామా! కొట్టం కార్తా ఉంది. కాసిగడ్డి కప్పించవయ్యా అంటే ఇనకపోతివి. నూడు ఇల్లంతా ఎలా కార్తన్నాదో. రాత్రిపూట వానొస్తే ఇక శివరాత్రే" అంది నిష్ఠూరంగా.

లాంతరు గ్లాను పైకెత్తి బీడీ అంటించుకుని దమ్ము లాగుతూ - చిమ్మి నర్ది ఒంటి నిండా రగ్గు కప్పుకుని పిల్లల పక్కన కూర్చుంటూ - "రవ్వంత ఓపిక పట్టవే రంగీ! గడ్డి మాత్రమే కప్పియ్యాలనుకుంటే ఆ పని ఏనాడో చేసేవాణ్ణి. ఈసారేమైనా నరే నుట్టూ గోడలు లేపినాకే గడ్డి కప్పేది. నలి కాలంలో నలికి, వానకాలంలో వానకి భయం లేకుండా పోతుందప్పుడు. యెచ్చగా పడుకోవచ్చుప్పుడు. ఏమంటావే రంగీ?" బీడీ పొగ వదులుతూ అన్నాడు సాంబయ్య.

"అన్ని డబ్బులు మనకాడ యాడున్నాయి మామా!"

"యవసాయ బ్యాంక్‌లో పిగ్మి కడ్తున్నానే. అది నీకు తెలుసుగా? ఇంకో రెణ్ణెల్లుపోతే ఆ డబ్బులొస్తాయని ఏజెంటు సెప్పినాడు. దాంతో కట్టుకుందాం."

"అట్టానా! అయినా నాకు తెల్వక అడుగుతున్నా - అది అయ్యే పనేనా? అమాయకంగా అడుగుతున్న పెళ్లాన్ని చూస్తూ - "ఎందుక్కాదే" అడిగాడతను.

"ఈరన్న ఇసయం మరిచినావా ఏంది మామా?"

గుడిసె కట్టి తీరాలనే పట్టుదలతో ఉన్న సాంబయ్య ఉత్సాహం చప్పున చల్లారిపోయింది. వెంటనే జంబన్న గుర్తుకొచ్చాడు. గతం అతని మనో నేత్రం ముందు సినిమా బొమ్మలా కదిలింది.

** ** **

"మామా! ఓ బీడియ్యి మామా..."

"ధణీ! 'టీ' తాపియ్యి."

"యల్లమ్మత్తా! ఇంట్లో తినే దానికేం లేదు, రెండు శేర్లు జొన్నలిప్పియత్తా. పిల్లా పాపా నీ పేరు చెప్పుకుని తింటాం."

మోకాలి కిందికి ఖాకీ నిక్కరు, చిరిగిన చొక్కాతో తెలిసిన వాళ్ళ అందరి దగ్గరా అడుక్కుంటూ రోజులు గడిపేవాడు జంబన్న. కూలీ, నాలికి పోవాలంటే ఇష్టం లేదు. కష్టపడకుండా దినం గడిచిపోవాలి. అనేది అతని అభిప్రాయం. పెళ్లాం కూలీకి పోయేది. ఉన్నప్పుడు తినేవారు. లేని పూట కలో గంజో తాగి గడిపేవారు.

అలాంటి జంబన్న చెప్పా పెట్టకుండా ఊరు వదిలాడు. ఆ విషయం ఊళ్లో జనం అంతగా పట్టించుకోలేదు. మూడేళ్లు గడిచాయి. హఠాత్తుగా మాయం అయిన జంబన్న అలాగే ప్రత్యక్షం అయ్యాడు.

అయితే ఖాకీ నిక్కరు స్థానంలో ఖద్దరు పంచె, చిరుగుల చొక్కా స్థానంలో ఖద్దరు జుబ్బా ఉన్నాయి. వేషం మారింది. రాజకీయాలు మాట్లాడ్డం నేర్చాడు. వనీ



పాటా లేని వాళ్లతో చేరి ఎన్నెన్నో విషయాలు చెప్పేవాడు.

ఎలక్షన్లొచ్చాయి. ఎప్పటిలాగానే ఉన్నోళ్లు, పెద్దోళ్లు ఎమ్. ఎల్. ఎ. గా నామినేషన్లు వేసి ప్రచారం మొదలు పెట్టారు. వారితోపాటు జంబన్న కూడా నామినేషన్ వేశాడు. దాని గురించి కూడా పట్టించుకోలేదు జనం. ఎందరో నామినేషన్లు వేస్తుంటార్లే అన్నట్లుగా.

ప్రచారం ఉధృతమైంది. జంబన్న మాత్రం ప్రతి గడపకూ వెళ్లి "అమ్మా! బీదోణ్ణి, బేదోళ్ల కష్టాలు తెలిసినోడ్ని. నన్ను గెలిపిస్తే మీ కష్టాలన్నీ తీరుస్తాను. నన్ను నమ్మండి. పెద్దోళ్లు గెలిస్తే అయిదేండ్ల దాకా మళ్లీ ముఖాలు చూపించరు. అదే నేనైతే మీ కండ్లెదుటే ఉంటా. దయచేసి మీ ఓటు నాకే యెయ్యండి" అనటూ దీనంగా, నమ్మకంగా, ఓపిగ్గా ప్రచారం చేశాడు. ప్రజల మనస్సుల్లోకి చొచ్చుకపోయాడు. వాళ్ళలో ఆలోచనలు రేకెత్తించాడు. "అవును ఎవరు గెలిచినా చేసేదేం లేదు. వీడు బీదోడు. వీడు గెలిస్తే దేనికైనానరే వీడిని నిలదీయవచ్చు" అనుకున్నారు.

ప్రజల అభిప్రాయానికి తిరుగుంటుందా!

రాజకీయ పండితుల అంచనాల్ని తల్లకిందులు చేస్తూ గెలిచాడు జంబన్న. వాళ్లు అయోమయంలో ఉండగానే నియోజకవర్గం అంతా తిరిగి ఓటు వేసినోళ్ళకి, వేయని వాళ్లకి చెయ్యెత్తి దండాలు పెట్టాడు. అది చేస్తాను, ఇది చేస్తాను అని మరీ మరీ చెప్పాడు.

అంతే -

రోజులు, నెలలు గడిచాయి.

సంవత్సరం గడిచింది.

ఎందరెందరో చిన్నోళ్లు, పెద్దవాళ్లు ఇంటికొచ్చారు. జీర్ణావస్థలో ఉన్న మట్టి ఇల్లు జంబన్నది. ఒక ఎమ్. ఎల్. ఎ. అయి ఉండి ఇలాంటి ఇంటిలో ఉంటే ప్రజలు ఏమనుకుంటారు. ఎలాగైనా సరే. ఇల్లు కట్టాల్సిందే అనుకున్నాడు జంబన్న.

మెల్లగా మొదలుపెట్టాడు. అది మెల్ల మెల్లగా రూపులు మారి పెద్ద బిల్డింగ్ అయింది. ఇంటికి ఎదురుగా రోడ్డు అవతల ఏనాడో కట్టిన అరుగు వడగొట్టించాడు. ఎందుకంటే అక్కడ కూర్చునే వారు తనొస్తుంటే లేచి నిలబడరనే అక్కసుతో..

దాని గురించి కూడా పట్టించుకోలేదు జనం. తెలివైన రాజకీయ నాయకుడెప్పుడూ తెలివైన వారిని తన చుట్టూ చేర్చుకోడు. పందిమాగదుల్లాంటి వారిని చేరదీస్తాడు. వాళ్లతో తనకు అపాయం లేదని గుంటనక్కల్లాంటి వారు అతని పక్కన చేరారు. తమ పబ్బాల్ని గడుపుకునే వారు. పంచుకునే దానిలో తేడాలొచ్చి మల్లన్న అనే అతని అనుచరుడు మాటకు మాట బదులిచ్చి ప్రతిపక్షంలో చేరిపోయాడు. అంతటితో ఊరుకోలేదు. జంబన్న అవినీతి పనుల్ని పేపర్ల కెక్కించాడు. అతని గుట్టు రట్టు చేశాడు.

ఇంతవరకూ జంబన్న లాంటి నీతిపరుడు లేడని ఢంకా బజాయించి చెప్పిన మల్లన్న నోటివెంట ఇలాంటి మాటలు వినడంతో ప్రజలు అవాక్కయ్యారు. ఔరా! అని ముక్కు మీద వేలుంచుకున్నారు.

అగ్గి మీద గుగ్గిలం అయ్యాడు జంబన్న. మల్లన్న నెలాగైనా తొక్కేయ్యాలని ఆలోచనలకు పదును పెట్టాడు. మల్లన్న వేసుకున్న గుడిసే స్థలం పంచాయతీదని గుర్తుకొచ్చింది. అది ఎంతలేదన్నా పది వేలు పైనే ఉంటుంది. దాన్ని ఎలాగైనా సరే పడగొట్టించాలి అనుకున్నాడు. కలెక్టర్, ఎం.ఆర్.వీలకు కంప్లైంట్ ఇచ్చాడు. మేధకు పదునుపెట్టి ఆఫీసర్లయిన వాళ్లు, ఓనామాలు రాకున్నా రాజకీయ నాయకుడైతే చాలు. వాడు చెప్పిన మాట అది తప్పా - ఒప్పా? అని తెలిసినా ఏమి చేయలేక వాళ్లు చెప్పినట్లు చేయడం అలవాటుగా మారిపోయింది.

అంతే—

ఆర్డర్ జారీ అయ్యింది. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న బీదా బిక్కి జనం గుడిసెలతో పాటు మల్లన్న గుడిసె కూడా కూలింది. ఆ దృశ్యాన్ని విడ్డూరంగా చూశారు జనం. అన్యాయం అని తెలిసినా ఏ ఒక్కరూ పెదవి విప్పలేకపోయారు. నెత్తినోరు కొట్టుకుంటూ విలపిస్తూ బాధితుల్ని ఓదార్చే వారు లేకపోయారు.

మల్లన్న మీద పగతో జంబన్న ఇదంతా చేయించాడని అందరికీ తెలుసు. అయినా అతన్ని ఇదేమిటి? అని అడిగే ధైర్యం ఎవరికీ లేకపోయింది. అధికారం ఉంది కదా వీడితో ఎందుకు అనుకున్నారు.

ఆ దినాన ఆనందంగా మందు కొట్టి మనసారా నిద్రపోయాడు జంబన్న.

ఎన్నో ఏళ్లుగా గుడిసెలు వేసుకొని కావురం ఉన్న బీదాబిక్కి జనం రోడ్డున పడ్డారు. అలాంటి వారిలో ఈరన్న వొకడు. దాచుకున్న డబ్బుకు కొంత అప్పు చేసి, మరి కొంత బదులు తెచ్చి బందోబస్తుగా కట్టుకున్నాడు గుడిసె. ఇంకా ఆర్నెల్లు కూడా కాలేదు. రాళ్ల గుట్టగా మారిపోయింది. ఆ దెబ్బ తట్టుకోలేక పోయాడు. దాన్ని మరువడానికి తాగాడు. అలా అలా తాగుబోతుగా మారిపోయాడు. బానిసయ్యాడు. ఇలా నానా బాధలకు గురయ్యారు గుడిసెవాసులు.

* * *

ఇదంతా తలుచుకొనేటప్పటికి వచ్చివేవకాయ నమిలినట్లుగా నోరంతా చేదుగా అయ్యింది సాంబయ్యకు. బీడీ దమ్ము పీల్చాడు. పొగరాలేదు. అదెప్పుడో ఆరిపోయింది. దాన్ని బండపై నులిపి మూలకు విసిరాడు. తానున్నదీ పంచాయతీ స్థలమే. అయినా అది ఈనాటిది కాదు. మా తాత ముత్తాతలందరూ ఈ గుడిసెలోనే కాపురాలు చేశారు. యేడాదికోసారి గుత్తకూడా ఇప్పటికే కడ్తున్నాడు .సారిబయ్య. అయినా జంబన్న లాంటి వాడిని చూశాక ధైర్యం చాలడం లేదు సాంబయ్యకు.

"ఛా.... యెదవనా.... మట్టిల్లు పీకి ఈడు బిల్డింగు కట్టొచ్చుగాని నేను గుడిసె భద్రంగా కట్టుకుందాం అనుకుంటే యముడ్లా అడ్డువస్తున్నాడు. ఎప్పుడు ఈడి పీడ విరగడ అవుతుందో అనుకుంటూ పెళ్లాం ఏం చేస్తుందోనని చూశాడు. వాన తగ్గినట్లుంది. పొటుకువడ్డం లేదు. బండలంతా తుడిచి పిల్లల పక్కన పడుకొని ఉంది.

'పిచ్చిది. పగలనకా రాత్రనకా పని చేస్తోంది. ఏనాడు యినుక్కోదు. 'మామా! ఇది కావాలా అని ఏనాడు అడుగదు. కాలం కలిసి రాకపోదా! గుడిసె భద్రంగా కట్టుకోకపోదా! తన పెళ్లాం పిల్లలు యెచ్చగా పడుకోకపోరా.... చూద్దాం....." అనుకుంటూ నిండా రగ్గు కప్పుకొని ముడుచుకొని పడుకున్నాడు సానబయ్య.

* * *

బళ్లున తెల్లవారింది.

ఆరోజే ఓటింగు. పొద్దు ఎక్కుతున్నట్లుగా పోలింగు బూతుల దగ్గర జనం బారులు పెరిగాయి. వరుసలో నిలబడిన సాంబయ్య పోలింగ్ ఆఫీసర్ ఇచ్చిన రసీదు తీసుకొని పరదా చాటుకు వెళ్లి బ్యాలెట్ పేపర్ మీద ముద్ర వేశాక సంతోషంతో అతని ముఖం వెలిగిపోయింది. తనలో ఎన్నాళ్లుగానో దాగిన కసిని తీర్చుకున్నాడు. బ్యాలెట్ పేపరు మడిచి పెట్టెలో వేసి ఆనందంగా ఇంటిదారి పట్టాడు.

ఎన్నో ఆశలు చూపి తన పబ్బం గడుపుకున్న జంబన్నను ప్రజలు తిరస్కరించారు. ఫలితం ఓటమి.

ఆ వార్త విని సాంబయ్య ఇంట్లో పాయసం చేయించుకొని తిన్నాడు. తన ఆశ నెరవేరే రోజు దగ్గరికొచ్చిందని సంతోషంతో పొంగిపోయాడు.

సాంబయ్య తాను ముచ్చటగా కట్టించుకున్న గుడిసెను చూసి ఆనందంతో పొనగిపోయాడు. కొత్త గోడలు - కొత్త వెదురు బొంగులు - కొత్తగా కప్పిన కాశిగుడ్డతో రాజభవనంలా అనిపించింది అతనికి. పక్కన ఉన్న గుడిసెలు పాతవిగా చిన్నవిగా కనిపించాయి. అతని కళ్లకు. కోరిక తీరిన మనసుతో తృప్తిగా చూసుకున్నాడు. ఇంటిల్లిపాది వెచ్చగా పడుకున్నారు - ఆ రాత్రి.

* * *

కాలం ఒకరి కోసం ఆగదు. ఏదైనా అంతే.

ఓ సాయంత్రం ఫీరాసాబ్ హోటల్లో 'టి' తాగుతున్నాడు సాంబయ్య. అప్పుడే వచ్చిన బజారప్ప వచ్చి పక్కన కూర్చున్నాడు.

"ఫీరా.... బజారికి ఓ 'టి' ఇయ్యి" అన్నాడు.

"అన్నా! ఇది ఇన్నావా?"

"ఏందిరా బజారీ....."

"మంత్రిగారి మనూరొస్తున్నారట. ఏదో బయోగాస్ ప్లాంట్ పెడున్నారంట. మన నెంబరు బుజ్జిగాడు సెప్పినాడు. మరేమో...." బజారి మాటలకు అడ్డు తగులుతూ "బయోగాస్ వస్తే మనకేమొస్తుందంట?" అమాయకంగా అడుగుతున్న సాంబయ్య బజ్జారప్ప కళ్లకు కురుక్షేత్రంలో అర్జునుడిలా కనిపించాడు. తాను గీత చెప్పే కృష్ణుడిలా ఫోజు పెట్టాడు.

"దాంతో కరెంటు దీపాలు వస్తాయట. అన్నం కూడా వండుకోవచ్చట" తనకు తెలిసింది చెప్పాడు బజారి.

"అట్లాగా! మరిదాన్ని యాడ కట్టిస్తారట."

"అది సెప్తా ఉంటేనే నీవు అడ్డొచ్చావు. యాడ్నో కడ్తే నీకెందుకు సెప్తాను. మన గుడిసెలుండే సోట కడ్తారట. మనకి ఊరి బయట వేట్టాలిస్తారంట." అని చావు కబురు చల్లగా చెప్పాడు.

అంతే! చేతిలోని గ్లాసు జారిపోతుంటే ఫీరా సాహెబ్ 'అరెరే! సాంబయ్యా గ్లాసు భద్రం" అంటున్నంతలోనే కిందపడి బళ్లున ముక్కలయ్యింది.

"ఇంకెక్కడి భద్రం రా! మన బ్రతుకులికే భద్రం లేనప్పుడు అనుకున్నాడు. మనసులోనే సాంబయ్య జరిగేది ఊహించుకుంటూ— ●

పుస్తకం

"ఏమండీ.... నాలుగేళ్ళ నుంచీ మనింటికి చుట్టాలెవరూ రావడం లేదు. నాకు చాలా అవమానంగా ఉందండీ!" దిగులుగా అంది భార్య.

'వంకాయతో వంద రకాలు' పుస్తకం రాయొద్దంటే వినిపించుకున్నావు కాదు మరి! కోపంగా చెప్పాడు భర్త.

గొంటు శ్రీనివాస్